సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 26 । మే । 2023





## లారీని ఢీకొన్న బైక్

లారీని మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కందుకూరు మండలంలో గురువారం జరిగింది. 8లో



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.62,230 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,589 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.5,757 |
| నవర (8 గ్రా) | రూ.46,056 |

గరిష్టం/కనిష్టం
41.6 /30.8

## వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో 44 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.


## న్యూస్‌రీల్

### 860 పొగాకు బేళ్ల విక్రయం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 860 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 894 బేళ్లను వేలానికి తీసుకురాగా, 34 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.200, అత్యల్పంగా రూ.182 ధర పలికినట్లు వివరించారు.

### సోమశిలలో 43.376 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 43.376 టీఎంసీలున్నాయి. 182 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,200, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200 కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

### మొక్కజొన్న నగదు జమ

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు సంబంధించిన రూ.30 లక్షల నగదును ఆయా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 37 మంది రైతుల నుంచి పంట కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించి రూ.36 లక్షల ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా 33 మంది రైతులకు రూ.30 లక్షల నగదును ఇచ్చామన్నారు. ఇంకా రూ.6 లక్షలు త్వరలోనే బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

### అనుమతి లేఖలు అందజేయాలి

నెల్లూరు(టౌన్): జిల్లాలోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా మారేందుకు సుముఖత ఉంటే అనుమతి లేఖలను శుక్రవారం ఉదయం 11 గంటల్లోపు నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ గంగాభవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఆ ఉపాధ్యాయులు బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా స్థానాన్ని కోరుకోవాలన్నారు. లేకుంటే కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) సర్‌ప్లస్ ఉపాధ్యాయుల్లో జూనియర్‌ను స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా మార్పు చేయనున్నట్లు వెల్లడించారు.

### ఉద్యోగ నియామకాల మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(బారకాసు): కలెక్టర్ ఆదేశాల మేరకు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, జీజీహెచ్ శాఖల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగ నియామకాల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా కోసం ఎస్‌పీఎస్ఎన్ఈఎల్ఎల్ఓఆర్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీస్/ఆర్ఈసీఆర్‌యూఐటీఎంఈఎన్‌టీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

### వెబ్‌సైట్‌లో పదోన్నతుల సీనియారిటీ జాబితా

నెల్లూరు(టౌన్): సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితా సీరియల్ నంబర్ 1 నుంచి 393 వరకు డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ గంగాభవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 199 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నట్లు తెలియజేశారు. మిగిలిన 194 మంది వెరిఫికేషన్ చేయించుకోలేదన్నారు. ఆ జాబితాను ఎంఈఓ వాట్సాప్ గ్రూపుల్లో ఉంచినట్లు తెలిపారు. వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు సేవా పుస్తకాన్ని తీసుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు నెల్లూరు దర్గామిట్టలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రావాలన్నారు. హాజరుకాని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పదోన్నతుల కౌన్సిలింగ్‌కు సీనియారిటీ జాబితాలో ఉన్న 393 మంది ఎస్జీటీలు హాజరై విల్లింగ్ లేదా అన్‌విల్లింగ్ లెటర్ ఇవ్వాలన్నారు.

# చెరువులు చెరబట్టి.. కలపను కొట్టి..

- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- కొందరు అధికారులకూ ప్రమేయం
- వింజమూరు, ఉదయగిరిల్లో ఇదీ పరిస్థితి
- నిమ్మకు నీరెత్తినట్లుగా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి

అనగనగా ఇరిగేషన్ చెరువులు. అక్కడ చిల్లకర్ర చెట్లు విస్తారంగా ఉన్నాయి. వాటిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. ఇంకేముంది యథేచ్ఛగా కొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం గురించి సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు కూడా తెలుసు. అయినా తమకేం పట్టనట్లుగా ఉన్నారు. దీంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు.



వింజమూరు పాతూరు చెరువులో చిల్లకర్ర నరికి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

ఉదయగిరి: వింజమూరు, ఉదయగిరి ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని పలు చెరువుల్లో రూ.లక్షలు విలువ చేసే చిల్లకర్ర (కలప)ను కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా నరికి తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఈ తంతు ఆ సబ్ డివిజన్‌ల్లో విధులు నిర్వహించే కొందరు అధికారుల ప్రమేయంతో సాగుతున్నట్లు ప్రచారం ఉంది. వారిని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులు చీవాట్లు పెట్టినా ధోరణిలో మార్పు కనిపించడం లేదు. ప్రభుత్వం ఇచ్చే జీతాలు తీసుకుంటూ పై ఆదాయానికి అలవాటు పడ్డారు. చీవాట్లు పడిన నాలుగు రోజులు అలా ఉండి తర్వాత తమ పని సాగిస్తున్నారు. ప్రస్తుతం పొగాకు బ్యారెన్ల సీజన్ కావడంతో కలపకు మంచి గిరాకీ ఉంది. దీంతో మూడు నెలల నుంచి అనేక చెరువుల్లో చిల్లకర్రను భారీగా కొట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అధికారుల అండతోనే కలప తరలిస్తున్నామని అక్రమార్కులు బాహాటంగానే చెబుతున్నారు.

**బయటపడింది**

మూడు నెలల క్రితం ఉదయగిరి మండలం గండిపాళెం జలాశయం పరిధిలోని బ్యాక్ ప్రాంతంలో రూ.లక్షలు విలువ చేసే కలప తరలించడం వెనుక అక్కడ పనిచేసే ఓ అధికారి పాత్ర వెలుగు చూసింది. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడుకుని ఎలాంటి చర్యలు లేకుండా బయటపడ్డాడు. కలపను అమ్మి సొమ్ము చేసుకున్న వారిపై చర్యల్లేవు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది.

**ఇక్కడిలా..**

వింజమూరు సబ్ డివిజన్ పరిధిలో కనియంపాడు, కలిగిరి, కమ్మవారిపాళెం, భైరవరం, వింజమూరు తదితర ఇరిగేషన్ చెరువుల్లో ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఓ అధికారి ప్రమేయంతో పెద్దమొత్తంలో చిల్లకర్రను నరికి తరలించారు. ఈ వ్యవహారంలో సదరు అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గతంలో కూడా ఆయన పలు ఇరిగేషన్ చెరువులకు సంబంధించిన ఇనుప గేట్లు, ఇతర సామగ్రిని అమ్మి జేబులు నింపుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వింజమూరు పెద్ద చెరువులో (పాతూరు) వారంరోజుల నుంచి కొంతమంది గిరిజనుల సహాయంతో ఇరిగేషన్‌లో పనిచేసే ఓ అధికారి కలప కొట్టించి రవాణా చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానికులు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు గురువారం ఏఈ స్థాయి అధికారి అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు.



వింజమూరు మండలం బొమ్మరాజు చెరువులో గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గుంతలు (ఫైల్)

**ఇప్పటికే చెరువులు గుల్ల**

వింజమూరు సబ్ డివిజన్ పరిధిలోని ఊటుకూరు, వింజమూరు పాతూరు, బొమ్మరాజు చెరువు, మలపరాజు వాగు చెరువు తదితర ఇరిగేషన్ చెరువుల నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్‌ను దుత్తలూరు – కావలి జాతీయ రహదారి పనులకు తరలించారు. ఈ తతంగం కూడా ఆ సబ్ డివిజన్‌లో పనిచేసే అధికారి ప్రమేయంతోనే జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన రాబడికి గండి పడింది. ఆ అధికారి ముడుపులు తీసుకుని సదరు కాంట్రాక్టర్‌కు ప్రయోజనం కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇరిగేషన్ చెరువుల్లో పెద్దఎత్తున గుంతలు తవ్వడంతో అవి ప్రమాదకరంగా మారాయి.

### అనుమతి లేకుండా..



ఇరిగేషన్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్

అనుమతి లేకుండా వింజమూరు పాతూరు చెరువులో చిల్లకర్ర కొట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం స్థానిక ఏఈ వైష్ణవి సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. వారంరోజుల నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా కలప తరలిస్తున్నట్లు ఎస్ఈకి ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు కలప రవాణాను అడ్డుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఆమె తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ వెల్లడించారు.

### చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ చెరువుల్లో చిల్లకర్ర కొట్టాలంటే ముందుగా అనుమతులు తీసుకుని వేలంపాట పెట్టాలి. హెచ్చు పాటదారులు ఆ కలప కొట్టే హక్కును కలిగి ఉంటారు. అనుమతి లేకుండా చిల్లకర్ర, గ్రావెల్ తరలిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమోహన్, ఎస్ఈ, ఇరిగేషన్

# వేగవంతంగా భూసేకరణ

- ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న



మాట్లాడుతున్న ప్రద్యుమ్న, చిత్రంలో హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో భూసేకరణ పనులు వేగవంతం చేయాలని రహదారులు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రద్యుమ్న గురువారం సమీక్ష నిర్వహించారు. హైవేలు, ఇతర పనులపై ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష చేస్తున్నారని, కాబట్టి ప్రత్యేక శ్రద్ధ పెట్టి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఆర్డీఓలు, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు మల్లోల, శీనానాయక్, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేపై అశ్రద్ధ వద్దు

- జగనన్నకు చెబుదాంపై అలసత్వం తగదు
- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఎం.హరినారాయణన్ హెచ్చరించారు. గురువారం జేసీ రోణంకి కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఆర్వో వెంకటనారాయణమ్మతో కలిసి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ రెవెన్యూలో ఒక భాగమని, అధికారులందరూ రోజూ రెండు, మూడు గంటలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రేపటికి, వారానికి, 15 రోజులకు ఏం చేయాలో ముందుగా కార్యాచరణ రూపొందించుకుని పనిచేస్తే రీసర్వే చాలా సులభతరం అవుతుందన్నారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు గ్రామాల్లో పర్యటించి ఈ ప్రక్రియను పరిశీలిస్తే పురోగతి ఉంటుందన్నారు. వీఆర్వోలు, రీసర్వే డీటీ, సర్వే బృందం పనితీరును ఆర్డీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రీసర్వేలో ఆర్ఓఆర్ నుంచి 13 నోటిఫికేషన్ వరకు ఉన్న వివిధ దశలను పూర్తి అవగాహనతో అర్థం చేసుకుని పనిచేస్తే ఎటువంటి లోటుపాట్లు ఉండవన్నారు. రెవెన్యూ అధికారులందరూ గ్రామస్థాయిలోకి వెళ్లి గ్రామస్తులతో మమేకమైతే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

**దృష్టి సారించాలి**

జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తై అవార్డు జారీ చేసిన తర్వాత ఎటువంటి డాక్యుమెంట్లను రైతుల నుంచి అడగొద్దని, అవసరమైన డాక్యుమెంట్లను అవార్డు జారీ చేయకముందే పరిశీలించాలని చెప్పారు. కృష్ణపట్నం గ్రీన్‌ఫీల్డ్ ప్యాకేజీ–3, నెల్లూరు – బద్వేల్, బెంగళూరు – కడప – విజయవాడ జాతీయ రహదారుల భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. రైతులకు మార్కెట్ విలువ తగ్గకుండా ఉదారంగా నష్టపరిహారం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

**మ్యుటేషన్లపై నిర్ణయం**

మ్యుటేషన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని హరినారాయణన్ ఆదేశించారు. పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, పరిశీలించకుండా రిజెక్ట్ చేయడం తగదన్నారు. ఆర్డీఓలు కూడా తమ లాగిన్‌లో వచ్చిన మ్యుటేషన్లకు సంబంధించిన ఫైల్‌ను కార్యాలయానికి తెప్పించుకుని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకోవాలన్నారు. చిన్న చిన్న కారణాలతో తిరస్కరించడం తగదన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. సచివాలయం పరిధిలో పరిష్కారమయ్యే అర్జీలు మండల కేంద్రాలు, జిల్లాస్థాయి వరకు రాకూడదన్నారు. సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, ఆర్డీఓలు శీనానాయక్, మల్లోల, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాచలం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్**

భూహక్కు పత్రాలకు సంబంధించి జరిగిన అవకతవకలపై వెంకటాచలం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కార్యాలయ ఏఓను కలెక్టర్ ఆదేశించారు.

# వైద్యానికి బయలుదేరి.. దారిలోనే కడతేరి..

- చిన్నారి, యువతి వైద్యం కోసం చెన్నైకి..
- దారిలో మనుబోలు వద్ద ఘోర ప్రమాదం
- తండ్రి, కుమార్తె, సమీప బంధువైన బాలుడి మృతి
- ఐదుగురికి తీవ్రగాయాలు
- కొడవలూరు మండలం దామేగుంటలో విషాదం



ప్రమాదంలో నుజ్జయిన ఇన్నోవా కారు

కొడవలూరు/మనుబోలు: చిన్నారి, యువతి వైద్యం కోసం కారులో చెన్నైకి బయలుదేరారు. దారిలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని నింపింది. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి ఉండడం అంతులేని విషాదానికి దారి తీసింది. మనుబోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఆగి ఉన్న కంటైనర్ లారీని ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరంతా కొడవలూరు మండలం దామేగుంటకు చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. దామేగుంట దళితవాడకు చెందిన కలికిరి రామారావు (44)కు భార్య వనిత, ఇద్దరు కుమార్తెలున్నారు. వనిత చెన్నైలో ఉద్యోగం చేస్తూ కుమార్తెలతో కలిసి అక్కడే ఉంటోంది. రామారావు మాత్రం ఊర్లోనే ఉంటూ కారు అద్దెకు నడుపుతుంటాడు. అప్పుడప్పుడు చెన్నైకి వెళ్లి భార్యాపిల్లలతో గడిపి తిరిగి దామేగుంటకు వస్తుంటాడు.

**ఏమి జరిగిందంటే..**

వేసవి సెలవులు కావడంతో రామారావు భార్యాపిల్లలు దామేగుంటకు వచ్చారు. వారికి సమీప బంధువైన గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న పెట్లు విష్ణుప్రియ నాలుగేళ్ల కుమారుడు సనత్ తేజ ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడికి నెల్లూరు నగరంలోని పలువురు వైద్యుల వద్ద చికిత్స చేయించినా నయం కాలేదు. బాలుడికి చెన్నైలో చికిత్స చేయిస్తే నయమయ్యే అవకాశముందని వనిత విష్ణుప్రియకు చెప్పింది. దీంతో ఆమె కుమారుడికి అక్కడే చికిత్స చేయించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో రామారావు తన భార్యాపిల్లలను చెన్నైలో వదలి రావాలని నిర్ణయించుకున్నారు. అదే కారులో కుమారుడిని కూడా చెన్నై తీసుకెళ్లి చికిత్స చేయించాలని విష్ణుప్రియ భావించారు. రామారావు సొంత కారులో వనిత, వారి కుమార్తెలు ఏంజెల్, మెర్సీ (15), విష్ణుప్రియ, ఆమె భర్త దుర్గాప్రసాద్ వారి కుమారుడు సనత్‌తేజ (4)తో గురువారం ఉదయం 5.30 గంటల సమయంలో దామేగుంట నుంచి చెన్నైకి ఇన్నోవా కారులో బయలుదేరారు. రామారావు అన్న నాగేశ్వరరావు (వీఆర్వో) కుమార్తె రేష్మ చెన్నైలోని శంకర నేత్రాలయ ఆస్పత్రిలో కంటికి సంబంధించిన చికిత్స చేయించుకునేందుకు వారితో కలిసి బయలుదేరింది.



రామారావు (ఫైల్)



మెర్సీ (ఫైల్)



సనత్ తేజ్ (ఫైల్)

**ప్రమాదం జరగడంతో..**

మనుబోలు మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో హైవేపై ఆగి ఉన్న కంటైనర్ లారీని ఇన్నోవా కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జవడంతో సనత్ తేజ, కారు నడుపుతున్న రామారావు, ఆయన రెండో కుమార్తె మెర్సీ అక్కడికక్కడే మృతిచెందారు. వనిత, విష్ణుప్రియ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రామారావు పెద్ద కుమార్తె ఏంజెల్, రేష్మ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. నాలుగేళ్ల కుమారుడు కళ్లెదుటే మృతిచెందడం, భార్య ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో తీవ్రగాయాలతో బాధపడుతున్న దుర్గాప్రసాద్ పరిస్థితి హృదయ విదారకంగా మారింది. తండ్రి రామారావు, చెల్లెలు మెర్సీలు మృతిచెందడం తల్లి వనిత ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో ఏంజెల్ గుండెలవిసేలా రోదిస్తోంది.

**పోలీసులు ఏమి చేశారంటే..**

సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కంటైనర్ కింద కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. గంట సేపు శ్రమించి దుర్గాప్రసాద్‌ను బయటకు తీయాల్సి వచ్చింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, వెంకటాచలం సీఐ గంగాధర్ రావు, మనుబోలు ఎస్సై ముత్యాలరావు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గురువారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు.

### బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

కొడవలూరు: మనుబోలు మండలంలో రోడ్డు ప్రమాదానికి గురై నెల్లూరు మెడికవర్‌లో చికిత్స పొందుతున్న దామేగుంట వాసులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అత్యవసర వైద్య ఖర్చుల కింద రూ.50 వేలు సాయమందించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

# 'ఫ్యామిలీ డాక్టర్'పై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ, అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పేదల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వివరించారు. జగనన్నకు చెబుదాం, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, క్రీడలు తదితర అంశాలపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి హరినారాయణన్, ఇతర అధికారులు హాజరయ్యారు. జిల్లాలో కొన్ని గ్రామాలను సందర్శించామని, టెలీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోజూ సమీక్షలు చేస్తూ వైద్య అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలిస్తూ పటిష్టంగా పథకాన్ని చేయడానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. డాక్టర్లు గ్రామాల్లోకి వెళ్లడం వల్ల షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. ఏఎన్ఎంలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగం చేసే ప్రదేశంలోని ఉండాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ అమలులో ఏమైనా లోపాలుంటే అధిగమించి ఇంకా ప్రజలకు మెరుగైన సేవలందే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎస్‌కు హరినారాయణన్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో విజ్ఞానం, వినోదం

వేసవిని చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయాలు సమ్మర్ స్పెషల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే వీటిపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అనేక మంది చిన్నారులను గ్రంథాలయాలకు రప్పించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటలతో కూడా వినోదాన్ని అందించి వారి సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికితీసేలా చర్యలు తీసుకుంటున్నారు.

- గ్రంథాలయాల్లో చిన్నారులకు సమ్మర్ క్యాంప్స్
- చదువుతో పాటు ఆటపాటల్లో శిక్షణ
- జూన్ 11 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఉత్సాహంగా హాజరవుతున్న చిన్నారులు

కోవూరు : గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. వేసవి సెలవుల్లో పలు అంశాలపై అవగాహన పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో ప్రత్యేక శిబిరాలను


డ్రాయింగ్ పోటీల్లో బిజీబిజీగా..


ధ్యానం చేస్తున్న చిన్నారులు

ఏర్పాటు చేసింది. వివిధ పోటీలను నిర్వహిస్తూ పిల్లల మానసిక ఉల్లాసానికి తోడ్పాటు అందిస్తోంది. ఆట వస్తువులు, కథల పుస్తకాలను అందిస్తూ ప్రోత్సాహిస్తోంది. ఈ వేసవి సెలవుల్లో ప్రభుత్వం విజ్ఞానంతో కూడిన శిక్షణ అందించేందుకు గ్రంథాలయాలను వేదికగా చేసింది. జిల్లాలో 61 గ్రంథాలయాల్లో ఈనెల 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 13 వరకు కొనసాగనున్నాయి. 10 నుంచి 15 ఏళ్ల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రంథాలయానికి సమీప ప్రాంతంలోని విద్యార్థులను రప్పిస్తున్నారు. నిత్యం వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా మానసిక వికసానికి సంబంధించిన ఆటపాటలు జరిపిస్తున్నారు. ప్రతి గ్రంథాలయంలో కనీసం 30 నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రంథాలయంలో ఒక క్వాలిఫైడ్ టీచరును నియమించారు.


నృత్యంలో తర్ఫీదు పొందుతున్న బాలికలు

### తరగతులు ఇలా..

ఉదయం 8 – 8.30 వరకు కథలు చెప్పడం, 8.30 – 9 వరకు పుస్తక పఠనం, 9– 9.30 వరకు డ్రాయింగ్, 9.30 – 10 వరకు స్పోకన్ ఇంగ్లిష్, 10 – 10.30 వరకు విరామం, 10.30 – 11 వరకు కథలు చెప్పడం, 11 – 11.30 వరకు స్ఫూర్తిదాయక ప్రసంగాలు, 11.30 – 12 వరకు నృత్యాలు, నాటకాలు, బొమ్మల తయారీ, ఆటల పోటీలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే టీచర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించేలా చర్యలు చేపట్టారు. రచయితలు, డ్రాయింగ్ మాస్టర్లు పలు రంగాలకు చెందిన వారితో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్నారు.

### గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. పోటీ పరీక్షల కోసం రూ.లక్షలు ఖర్చులు చేసి అనేక పుస్తకాలను అందుబాటులో ఉంచాం. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సొంత భవనాలను నిర్మిస్తున్నాం. వీటిలో కొన్ని ప్రారంభమయ్యాయి. కొన్నింటిని త్వరలో ప్రారంభిస్తాం. ఈ క్రమంలోనే విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నాం.

– దొంతు శారద, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్

### సమ్మర్ క్యాంప్‌లు తప్పనిసరి



జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాం . అన్ని గ్రంథాలయాల్లో తప్పనిసరిగా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలని ఆదేశించాం. షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్యాంప్‌కు వచ్చే విధంగా విస్తృతంగా ప్రచారం చేయించాం.

– కె.కుమార్‌రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

### సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలు తమ ప్రతిభను పెంపొందించేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడుతాయి. ఆ మేరకు తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రోత్సాహించాలి. అన్ని విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నాం.

– కందుకూరు రాజేశ్వరి, గ్రంథాలయాల కార్యదర్శి కోవూరు

# పాత నేరస్తుడి అరెస్ట్

- రూ.7 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

ముత్తుకూరు: నెల్లూరురూరల్, ముత్తుకూరు మండలంలోని పలు గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడిన పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి, ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలంలోని వడ్డిపాళెనికి చెందిన పల్లపు దేవేందర్ గతంలో కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లో చోరీలకు పాల్పడి, జైలు శిక్ష కూడా అనుభవించాడు. అతను చెడు వ్యసనాలకు బానిసై మళ్లీ చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో నెల్లూరురూరల్, ముత్తుకూరు మండలాల్లో 5 చోరీలకు పాల్పడ్డాడు. కోట మండలంలో ఒక బైక్‌ను చోరీ చేశాడు. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి, అతని సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బ్రహ్మదేవి సెంటర్ వద్ద అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.7 లక్షల విలువైన 15 సవర్ల బంగారు ఆభరణాలు, 60 గ్రాముల వెండితోపాటు చోరీలకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్తుడిని పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన పోలీసు సిబ్బంది నాగార్జున, పెంచలయ్య, శ్రీనివాసులు తదితరులకు డీఎస్పీ రివార్డు అందజేశారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి

## లారీని ఢీకొన్న బైక్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కందుకూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని మోపాడు–కొండముడుసుపాళెం గ్రామాల మధ్య మోపాడు చెరువు మలుపు వద్ద గురువారం జరిగింది. వివరాలు.. గుడ్లూరుకు చెందిన బి.నాగేశ్వరరావు(46), పి.వెంకటేశ్వర్లు సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై కందుకూరుకు వెళ్లారు. తిరిగి గుడ్లూరుకు వస్తుండగా కొండముడుసుపాళెం దాటిన తర్వాత మోపాడు చెరువు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న రేషన్ బియ్యం లారీని ఢీకొట్టారు. దీంతో రోడ్డుపై పడిపోయిన బి.నాగేశ్వరరావు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరులోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పి.వెంకటేశ్వర్లు తలకు కూడా తీవ్రగాయాలు కావడంతో చికిత్సనిమిత్తం 108లో కందుకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. మృతుడు బి.నాగేశ్వరరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

**అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే**

లింగసముద్రం మండలం మొగిలిచర్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ముగించుకొని స్వగ్రామమైన మాచవరానికి వస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఈ ప్రమాద ఘటనను చూశారు. 108 వాహనంతో పాటు పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. గాయపడిన వ్యక్తిని 108లో తరలించి, నాగేశ్వరరావు మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించే వరకు అక్కడే ఉన్నారు.

## క్లుప్తంగా


### పశుబీమాకు రిజిస్ట్రేషన్స్

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ పశుబీమా పథకానికి సంబంధించి జిల్లాలోని పాడి రైతులు రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 80 శాతం రాయితీ ఉంటుందని, మిగిలిన వారికి 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ప్రతి పాడి రైతు సమీపంలోని రైతుభరోసా కేంద్రంలో పూర్తి వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

### నేటి నుంచి సోమశిల దక్షిణ కాలువకు నీటి విడుదల

చేజర్ల(సోమశిల): సోమశిల దక్షిణ కాలువకు శుక్రవారం నుంచి నీరు విడుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలువ పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 24ఎల్ వరకు నీటిని అందిస్తామని, కాలువపై మోటార్ల ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలిపారు.

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | రూ.55 |
| సన్నవి | రూ.20 |
| పండ్లు | రూ.15 |



# వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట


ఎక్స్‌రే ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.46 లక్షలతో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే ప్లాంట్, బ్లడ్ స్టోరేజ్ సెంటర్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ వైద్యం అందాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఆ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పగడ్బందీగా అమలు చేస్తూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్‌ను ప్రభుత్వం తీసుకువచ్చి రోగులపై వ్యక్తిగత పర్యవేక్షణ చేపడుతోందని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాల్లో అదనపు పీహెచ్‌సీలను ఏర్పాటు చేశామని తెలిపారు. పొదలకూరు సీహెచ్‌సీ 5 మండలాలకు కేంద్రబిందువైనందున ఇక్కడ బ్లడ్‌స్టోరేజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాలంటే అందుబాటులో ఉంటుందన్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో అన్నివిభాగాలకు వైద్యులు ఉన్నారని, 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహేష్, వైద్యాధికారి పద్మావతి, మల్లికార్జున, నజ్మా, స్రవంతి, నర్సింగ్ సిబ్బంది, తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోపెడ్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నెల్లూరురూరల్: ఇంట్లోని కుటుంబసభ్యులకు ఆహారం తీసుకెళుతూ మోపెడ్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన నెల్లూరురూరల్ పరిధిలోని కనుపర్తిపాడు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి ఇందిరమ్మకాలనీలో చింతపండు రవి(35) కూలి పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో నివసిస్తున్నాడు. అతను నివాసం ఉంటున్న ప్రాంతానికి సమీపంలో కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మిగిలిన భోజనాన్ని ఇంటికి తీసుకెళ్లేందు సిద్ధమయ్యాడు. ఆహారాన్ని తీసుకుని తన మోపెడ్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నెల్లూరు – గొలగమూడి రహదారిపై మోపెడ్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో నడంతో రవి తీవ్రంగా గాయపడి రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రవి మృతదేహం

## ఇంటర్ పరీక్షలకు 581 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 581 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు 12,017 మంది విద్యార్థులకు గాను 11,566 మంది హాజరయ్యారు. 451 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు 1,338 మంది విద్యార్థులకు గాను 1,208 మంది హాజరయ్యారు.

130 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 62 కేంద్రాల్లో ఆర్ఐఓ వరప్రసాదరావు, ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

# 35 సవర్ల బంగారం చోరీ

- 2 కేజీల వెండి అపహరణ
- కావలిలోని ముసునూరు బాలాజీనగర్‌లో ఘటన

కావలిరూరల్: కావలి పట్టణంలోని ముసునూరు బాలాజీనగర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి సుమారు 35 సవర్ల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి వస్తువులు అపహరించిన ఘటన గురువారం వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు ముసునూరు బాలాజీనగర్‌కు చెందిన చుండి జ్యోతిలత రెండంతస్తుల భవనాన్ని నిర్మించుకుని కింద పోర్షన్‌ను బాడుగకు ఇచ్చి, పై పోర్షన్‌లో ఆమె నివాసం ఉంటోంది. ఇంటి యజమాని భర్త చుండి మధుసూదన్‌రెడ్డి మృతిచెందగా కుమారుడు, కుమార్తె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో జ్యోతిలత 3 నెలల క్రితం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లింది. కాగా ఆ ఇంట్లోని కింది పోర్షన్‌లో వాకాడుకు చెందిన యల్లా రాజేశ్వర్‌రెడ్డి – శశ్విత దంపతులు అద్దెకు ఉంటున్నారు. యల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్ఎస్ దాబా నిర్వహిస్తుండగా ఆయన భార్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. మూడు రోజుల క్రితం వారు స్వగ్రామం వాకాడుకు వెళ్లారు. ఈ క్రమంలో రాజేశ్వర్‌రెడ్డి తన ఇంట్లో పెంచుకుంటున్న పిల్లికి ప్రతి రోజూ దాబాలో పనిచేసే వ్యక్తి వచ్చి ఆహారం పెట్టివెళుతుంటాడు. గురువారం కూడా దాబాలోని వ్యక్తి పిల్లికి ఆహారం పెట్టి వస్తుండగా ఇంటి బయట గేటు తాళాలు తీసి ఉండడాన్ని గమనించి రాజేశ్వర్‌రెడ్డికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రెండు ఇళ్లలో తలుపులు పగులగొట్టి బీరువాలు, కబోర్డులలోని వస్తువులు చెల్లాచెదురుగా పడేసి పై పోర్షన్‌లో 10 సవర్ల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి వస్తువులు, కింది పోర్షన్‌లో సుమారు 25 సవర్ల బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు